పోస్టాఫీస్ అడ్రస్ ఎక్కడ?

తోకలేని పిట్ట తొంభై ఊర్లు తిరిగిందన్న పొడుపు కథ తెలుసు కదా.... మరి ఆ తోకలేని పిట్ట బయలు దేరే కార్యాలయ చిరునామా కోసం ప్రజలు పాట్లు పడుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన తపాలా కార్యాలయం ఊరికి దూరంగా.. సందులో నిర్వహించడంతో వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. చాలా మందికి పోస్టాఫీస్ ఎక్కడ ఉందో తెలియక దాని సేవలు వినియోగించుకోలేకపోతున్నారు. అందరికీ అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయాన్ని దూరంగా మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

• ఊరికి దూరంగా తపాలా కార్యాలయం • చేరువలో పెట్టాలని ప్రజల విజ్ఞప్తి



దగ్గరకు వెళ్తేగాని కనపడని తపాలాకార్యాలయ బోర్డు



పోస్టాఫీస్ చిరునామాకు ఆధారమైన శాతవాహననగర్ బోర్డు



కణితి కాలనీ వ్యూ

కూర్మన్నపాలెం: అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల దశాబ్దాల చరిత్ర కలిగిన కణితి పోస్టాఫీస్ చిరునామా కోసం ప్రజలు పాట్లు పడుతున్నారు. వడ్లపూడి మెయిన్‌రోడ్డు సమీపంలో ఉన్న తపాలా కార్యాలయాన్ని ఏడాది కిందట శాతవాహన నగర్‌కు అధికారులు మార్చేశారు. అక్కడికి వెళ్లాలంటే డజను సందులు.. అరడజను మలుపులు తిరగాల్సి వస్తోంది. ఆ అడ్రస్ కూడా ఎవరైనా బాగా తెలిసిన వారు చెప్పగలిస్తే ఓకే..లేకపోతే అంతే సంగతులు. పోస్టాఫీస్ ఎక్కడ ఉంది అని ఎవరైనా అడిగితే తెలియదనే సమాధానం వస్తుంది.

ఇదీ పరిస్థితి

స్వాతంత్ర్యం రాకముందు కణితి మేజర్ పంచాయతీగా ఉన్నకాలంలో పోస్టాఫీస్‌ను నెలకొల్పారు. అప్పట్లో దుగ్గవానిపాలెం, కాశీపాలెం, చినమడక, పెదమడక, సిద్దేశ్వరం, చిననడుపూరు, సీతానగరం తదితర పన్నెండు గ్రామాలకు సేవలు అందించేది. ఆ తర్వాత విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటులో కణితితో పాటు అనేక గ్రామాలు తరలించడంతో ఆ కార్యాలయాన్ని కూడా వడ్లపూడి ప్రాంతానికి తరలించారు. అప్పటి నుంచి కణితి మెయిన్ రోడ్డుకు ఆనుకొని నిర్వహణ జరిగేది. ఆ తర్వాత కొంతకాలనికి వడ్లపూడి కాలనీకి తపాలా కార్యాలయాన్ని మార్చేశారు. అక్కడ నిర్వహణ జరుగుతుండగానే కణితి పోస్టాఫీస్ కాస్తా వడ్లపూడి పోస్టాఫీస్‌గా మారి పోయింది. అందరికీ అందుబాటులో ఉండగా... ఏడాది కిందట శాతవాహనగర్‌కు తరలించారు. అక్కడివెళ్లాలంటే ఎవరితరం కావడంలేదు. చిరునామా వెతుక్కోవడమే పెద్ద తలనొప్పి అయితే... అక్కడికి వెవెళ్లడానికి తగిన సదుపాయాలు లేక ప్రజలు వ్యయప్రయాసలకు గురికావాల్సివస్తోంది.

భవనాలు దొరకక పోవడం వల్లే...

అయితే దీనికి అధికారుల వాదన వేరేలా ఉంది. పోస్టాఫీస్‌ను తరలించే ముందు నోటిఫికేషన్ ఇచ్చామంటున్నారు. భవనాలు అద్దెకిచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో శాతవాహన నగర్‌లోని భవనాన్ని ఎంపిక చేయాల్సి వచ్చిందని వారు చెబుతున్నారు. బడ్జెట్‌కు అనుకూలంగా ప్రధాన ప్రాంతాల్లో భవనాలు దొరకక పోవడం వల్లే శాతవాహననగర్‌లో తీసుకున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

అందుబాటులో లేదు



నాకు 70 సంవత్సారాలు. నేను పుట్టక ముందు నుంచి మాకణితి గ్రామంలో పోస్టాఫీస్ ఉండేది. స్టీల్‌ప్లాంట్ నిర్మాణంలో మా ఊరు తరలించిన తర్వాత నిర్వాసిత కాలనీలో ఎన్నో ఏళ్లు నిర్వహించారు. అక్కడి నుంచి వడ్లపూడికి తరలించి కణితి పేరు తీసి వడ్లపూడి పోస్టాఫీస్‌గా మార్చేశారు. ఇప్పుడు ఎవరికి అందుబాటులో లేని ప్రాంతానికి తరలించడం అన్యాయం.

– ప్రగడ అప్పలనర్సింహం, కణితికాలని

తికమక పడుతున్నాం



పోస్టాఫీస్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అనేక మలుపులు తిరిగి అక్కడికి చేరుకోవాలంటే తల ప్రాణం తోకకు వస్తోంది. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పోస్టాఫీస్ ఇరుకు సందుల్లో పెడితే ఎలా?. కాస్తా అధికారులు ఆలోచించాలి.

– ఎస్.పార్వతి, అంబేడ్కర్ కాలనీ

పోస్టల్ సేవలకు దూరం



ఉక్కు ఉద్యోగులతో పాటు ఎంతో మంది నివసిస్తున్న నిర్వాసిత కాలనీ వాసులకు పోస్టాఫీస్ అందుబాటులో లేకుండా పోయింది. ఉత్తర ప్రత్యుత్తరాల మాట అటుంచితే ఇతర అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది. వృద్ధులు పోస్టాఫీస్‌కు వెళ్లడం మానేశారు. చాలా మంది సేవలకు దూరమయ్యారు.

– వి.ఈశ్వరరావు, కణితి

రోడ్డు ఛిద్రం



జగ్గరాజుపేట, ఎస్టీబీఎల్‌కు వెళ్లే మార్గం దుస్థితి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు నుంచి ఎస్టీబీఎల్, కాపు జగ్గరాజుపేట వెళ్లే మార్గం అతలాకుతలమైంది. ఇటీవల రైల్వే ప్లాట్‌ఫారం విస్తరణ పనులు నేపథ్యంలో రహదారిని విస్తరించి రైల్వే స్థలం చుట్టూ గోడ నిర్మిస్తున్నారు. అదనపు ట్రాక్ నిర్మాణ పనుల మెటీరియల్ రవాణా కోసం బ్లాక్ మెటల్, క్రషర్ బుగ్గితో రోడ్డు చదును చేశారు. తర్వాత భారీ వాహనాల రాకపోకలతో రహదారి మళ్లీ నూతుల్లాంటి గోతులతో నిండిపోయింది. ఈ మార్గంలో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలు, ఎస్టీబీఎల్, కాపుజగ్గరాజుపేట, షీలానగర్, గోపాలపట్నం వెళ్లే వాహనాలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

మధ్యవర్తిత్వ కేంద్రానికి కోర్టు కేసులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: సీపీసీ సెక్షన్ 89 ప్రకారం కోర్టులో దాఖలు చేసిన అన్ని కేసులను మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపాల్సి ఉంటుందని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి.షణ్ముఖరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల్లో భాగంగా 90 రోజుల మధ్య వర్తిత్వ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తులకు మధ్య వర్తిత్వంపై అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమణి, మధ్యవర్తి సభ్యుడు ఎ.వి.రత్నారావు తదితరులు పాల్గొన్నారు.


పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



లబ్ధిదారులకు కుట్టుమిషన్లను అందజేస్తున్న నిర్వాహకులు

గాజువాక: స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మినిస్ట్రీస్ నిర్వాహకుడు మహంతి, స్థానిక నాయకులు పప్పు రాజారావు, పుచ్చా విజయ్ కుమార్, శంకరరావు చేతులమీదుగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. మహంతి మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. తమ సంస్థ ద్వారా పేదలు నివసించే ప్రాంతాల్లో మంచినీటి బోర్లను ఏర్పాటు చేస్తున్నామని, అన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



నడుపూరులో విద్యుత్ స్తంభానికి పాకుతున్న పచ్చని తీగలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి ఇటు గాంధీనగర్.. అటు నడుపూరు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను చూస్తే అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు పచ్చని పొదలు కింద నుంచి పై వరకూ అల్లేశాయి. నిర్వహణ పనుల పేరిట గంటల తరబడి విద్యుత్ నిలిపివేస్తున్నా .. చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని వినియోగదారులు మండిపడుతున్నారు. స్తంభాలు కనిపించనంతగా పొదలు అల్లుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు కాదని జిందాల్‌కు సొంత గనులా..

సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: గత నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాదని ప్రైవేటు జిందాల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని చూడటం దుర్మార్గమని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కోసం పోరాడుతుంటే గనులు కేటాయించేందుకు చట్టం అనుమతించడం లేదని సాకుగా చెబుతున్నారన్నారు. మరి జిందాల్‌కు గనులు కేటాయించేందుకు చట్టం అడ్డు రాలేదా అని వారు ప్రశ్నించారు. సొంత గనులు లేకపోవడం వల్ల స్టీల్‌ప్లాంట్ వేలాది కోట్లు నష్టపోతున్నదన్నారు. ప్రకాశం జిల్లాలోని కొణిజేడు, మర్లపాడు ప్రాంతంలో ఉన్న ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని విశాఖ స్టీల్ ప్లాంట్ రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు దరఖాస్తు చేసిందన్నారు. రాష్ట్రంలోని గనులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వానికి సూచించిందన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు భూములతో పాటు అనేక వేల కోట్లు రాయితీలు ప్రకటించారన్నారు. దీనికి తోడు పోర్టు కేటాయించడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం ఉందన్నారు. తక్షణం స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్రంలో గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కులు కల్పించాలని ఫిర్యాదు

అగనంపూడి: తప్పుడు ధ్రువపత్రాలతో ఇంటి నెంబర్ వేయించుకోవడమే కాకుండా తప్పుడు సర్వేనంబర్‌తో గిఫ్ట్ డీడ్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మేడిశెట్టి శారద మంగళవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్టాంప్స్ అండ్ డ్యూటీస్‌కు ఫిర్యాదు చేశారు. 2015లో పినమడకకు చెందిన జామి సన్యాసికి చెందిన స్థలాన్ని ఆయన భార్య, కుమార్తె తమకు రిజిస్ట్రేషన్ చేశారని ఆమె పేర్కొన్నారు. అయితే ఎటువంటి పత్రాలు, ఆధారాలు లేకుండా అదే గ్రామానిక చెందిన వ్యక్తి జీవీఎంసీ అధికారులను మభ్యపెట్టి ఇంటి పన్ను వేయించుకున్నారని, ఈవిషయంపై జీవీఎంసీకి ఫిర్యాదు చేయగా, 2022లో ఆధారలతో హాజరుకావాలని సదరు వ్యక్తికి జీవీఎంసీ నోటీసులు జారీ చేసిందని ఆమె పేర్కొన్నారు. అధికారుల విచారణలో ఉండగా సదరు వ్యక్తి తన భార్య పేరుతో గిఫ్ట్ డీడ్ చేశారని పేర్కొన్నారు. తప్పుడు సర్వే నంబర్‌తో గిఫ్ట్ డీడ్ చేసిన సదరు స్థలం పత్రాలు పరిశీలించి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమ స్థలంపై తమకు పూర్తి హక్కు కల్పించాలని శారద డీఐజీకి ఫిర్యాదు చేశారు.

ప్రజారోగ్యం గాలికి..

- తాండవిస్తున్న అపారిశుధ్యం
- శుభ్రానికి నోచుకోని కాలువలు
- మురుగుతోనే సావాసం..



వుడా కాలనీ పంపు హౌస్ వెనుక చిధ్రమైన కాలువ



వుడా కాలనీలో పూడుకుపోయిన కాలువ



వుడా కాలనీ ప్రాంతంలో..



స్మార్ట్ పాయింట్ ఎదురుగా..

పెదగంట్యాడ: మండలంలోని అత్యధిక కాస్ట్‌లీ ఏరియా.. అక్కడ ఉండే వారంతా కుబేరులే.. అయితే వారు ఇప్పుడు మురుగుతో సావాసం చేస్తున్నారు.. దోమలతో నిత్యం దండయాత్ర సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలోని కాలువన్నీ ఛిద్రం కావడంతో ఈ దుస్థితి నెలకొంది. అంతేకాకుండా రెండు నెలలుగా కాలువలను శభ్రం చేయడం లేదని తెలుస్తోంది.. మండలంలోని వుడా కాలనీలోని అన్ని లైన్లలోని కాలువలన్నీ ఛిద్రమయ్యాయి. ఈ ప్రాంతంలో టింపనీ స్కూల్, ఓక్ వ్యాలీ, బ్లూబర్డ్స్ వంటి పెద్ద పెద్ద పాఠశాలలు ఉన్నాయి. అలాగే అటు కమర్షియల్‌గా.. ఇటు నివాసాలతో నిత్యం కళకళలాడుతూ ఉంటోంది. గాజువాక నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల కంటే ఈ ప్రాంతం అన్ని విధాలా బాగుంటుందని, అన్ని సౌకర్యాల ఉంటాయని స్థిర నివాసాలు కూడా ఏర్పరుచుకోవాలని చూస్తుంటారు.. అయితే ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. అపారిశుధ్యం తాండవిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతంలోని ప్రధాన రహదారులు, ప్రధాన కాలువలను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. మిగిలిన రోడ్లను, కాలువలను వదిలేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉంటున్న వారు దుర్వాసన భరించలేక పోతున్నారు. నిత్యం దోమలతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ప్రజారోగ్య శాఖాధికారులు స్పందించి ఎప్పటికప్పుడు రోడ్లు, కాలువలు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

విశాఖ విద్య: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు ,టి.ఆర్.అంబేద్కర్ డిమాండ్ చేశారు. ఎస్‌ఏడీలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సంబంధిత అధికారులు తగిన చొరవ చూపకపోవడం వల్ల జీతాలు రావడానికి ఎంత సమయం పడుతుందనే ఆందోళనలో ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. జూన్ 15 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తయినప్పటికీ, వేతనాల చెల్లింపు సమస్యలకు పరిష్కారం లభించడం లేదన్నారు. క్లియర్ వేకెన్సీ లో జాయిన్ అయి ఎల్‌పీసీలు సమర్పించిన ఉపాధ్యాయులకు జూలై 6 నుంచి 10 లోపు సప్లిమెంటరీ బిల్లులు పెట్టాల్సి ఉండగా, సీఎఫ్ఎంఎస్ సైట్ 10 వ తేదీతోనే ఆపివేయడం వల్ల నిర్ణీత సమయంలో బిల్లులు సమర్పించలేని పరిస్థితి ఏర్పడింన్నారు. ఈ కారణంగా మరో నెల రోజులు పాటు జీతాలు అందని పరిస్థితి ఉపాధ్యాయులకు నెలకొందన్నారు. గిన్నీస్ బుక్ రికార్డుల మోత మోగించడంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులకు ఈ రీతిన బహుమానం ఇవ్వడం సరైంది కాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు జీతాలు వచ్చేలా చూడాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి విద్యుత్ కార్మికుల వినతి

తాటిచెట్లపాలెం: జేఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేసి, అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ ప్రకారం టైం స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్‌డీ) డి. సుమన్ కళ్యాణికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా వినతిపత్రాలను రాష్ట్ర వ్యాప్తంగా సేకరిస్తామని, ప్రాణాలకు తెగించి పని చేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2లకు న్యాయం చేయాలని వీరు కోరారు. ఈ విషయంలో న్యాయం చేసేలా ప్రయత్నం చేస్తానని సీజీఎం హామీ ఇచ్చినట్లు వీరు తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. సత్యారావు, పి. శ్రీనివాసరావు, పి. చంద్రశేఖర్, గ్రేడ్ 2 జేఎల్ఎం నాయకులు ఎస్. అప్పలరాజు, కె. శంకర్రావు, ఎస్. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందిస్తున్న సుధాకర్‌రెడ్డి రామనిర్మల దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అక్కిరెడ్డిపాలెం పంచవటి టౌన్‌షిప్‌కు చెందిన టి.సుధాకరరెడ్డి, రామనిర్మల దంపతులు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహం పాల్గొన్నారు.

హెచ్ఎంల సమావేశం నేడు

అగనంపూడి: అనకాపల్లి జిల్లా ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆదేశాల మేరకు పరవాడ మండల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఎన్నిక నిమిత్తం బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసినట్టు లంకెలపాలెం క్లస్టర్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొని మండల కమిటీ ఎన్నిక పూర్తి చేయడానికి సహకరించాలని ఆయన కోరారు.